క్లుప్తంగా

నేడు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్ దొర తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రంగంపేట: మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. అనపర్తికి చెందిన రమాదేవి హాస్పటల్ ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణారావు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

972 మందికి వైద్యసేవలు



కూనవరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని కూనవరం సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 972 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి చికిత్స చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఆయన వెంట హెచ్‌వీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు, ఏఎన్ఎంలు స్వాతి, సునీత ఉన్నారు.

ఆధార్ సెంటర్ కోసం కలెక్టర్‌కు వినతి

అనపర్తి: మండలంలోని కుతుకులూరు గ్రామ సచివాలయంలో ఆధార్ సెంటర్ మంజూరై ఆరు నెలలైనా ఏర్పాటు చేయలేదని, సెంటర్ ప్రారంభించాలని కోరుతూ గ్రామానికి చెందిన వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ దీనికి గల కారణాలను తెలుసుకోవడంతో పాటు ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో పి.వీణాదేవిని ఆదేశించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రాష్ట్ర చేనేత సదస్సు జయప్రదం చేయాలి

పెదపూడి: విజయవాడలో వచ్చే నెల 2న జరిగే రాష్ట్ర చేనేత సదస్సును పద్మశాలీలు అందరూ హాజరై జయప్రదం చేయాలని పద్మశాలీల సంఘం కాకినాడ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం కోరారు. ఆయన పెదపూడిలో సోమవారం మాట్లాడుతూ పద్మశాలీల సంఘం సంక్షేమ, అభివృద్ధికి నిర్వహించే హలో చేనేత–ఛలో విజయవాడ సదస్సును అందరం కలిసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

మొక్కజొన్న పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేశ్వరి, ఇతర సిబ్బంది

గోకవరం: ఇటికాయలపల్లి గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు యర్రంశెట్టి శివబాబు మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టాడు. ఇటీవల పంటకు మందు పిచికారీ చేయగా రెండెకరాల పంట ఎండిపోయింది. దీనిపై రైతు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఏఓ పి.రాజేశ్వరి తదితరులు పంటను పరిశీలించారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, తనను ఆదుకోవాలని రైతు అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

విజేతలకు అభినందనలు



వాలీబాల్ విజేతలను అభినందిస్తున్న దృశ్యం

రాజానగరం: అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో పాల్గొని వాలీబాల్‌లో ప్రథమస్థానంలో నిలిచిన గైట్ కళాశాల జట్టును, పీడీ డాక్టర్ సీఎం హెన్రీలను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, జీఎం డాక్టర్ పి.సుబ్బరాజు అభినందించారు. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలోని ఆర్‌కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇటీవల ఈ పోటీలు జరిగాయి.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శివరాత్రి మహోత్సవం సందర్భంగా దేవస్థానం ఈఓ పాటి సత్యనారాయణ, ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

అనపర్తి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- అమృత్ భారత్ స్టేషన్ పథకానికి ఎంపిక
- మౌలిక వసతుల కల్పనకు మాస్టర్‌ప్లాన్



అనపర్తి రైల్వే స్టేషన్

అనపర్తి: అనపర్తి రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. రైల్వేస్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో అనపర్తి రైల్వేస్టేషన్‌కు స్థానం దక్కింది. ఇది శుభసూచకమని అనపర్తి, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపకల్పన

విజయవాడ–విశాఖపట్టణం రైల్వే మార్గంలో ఉన్న ప్రధానమైన రైల్వేస్టేషన్లలో అనపర్తి రైల్వే స్టేషన్ ఒకటి. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా ఎంపికైన రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిపుణుల కమిటీని నియమించి వారి ఆధ్వర్యంలో ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారు. స్టేషన్ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్, నిపుణుల కమిటీ సూచనల మేరకు దశల వారీగా స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

అత్యాధునిక వసతులు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయడంతో పాటు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అత్యాధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ పథకానికి ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో 53 రకాల ప్రాథమిక, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎంపికైన స్టేషన్‌లో అధునాతన భవనాలు, పార్కింగ్ సౌకర్యం, స్టేషన్ పరిసర ప్రాంతాల సుందరీకరణ, లిఫ్టు సౌకర్యం, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ సౌకర్యాలు, దివ్యాంగుల సౌకర్యం కోసం ప్రత్యేక వీల్ చైర్లు, ప్రత్యేక ప్రవేశ మార్గాలు, స్టేషన్‌లో ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లు, స్థానిక ఉత్పత్తుల విక్రయాలకు గాను స్టాళ్ల ఏర్పాటు, అధునాతన విద్యుద్దీపాల వెలుగులు, వేగవంతమైన వైఫై కోసం 5జీ టవర్ ఏర్పాటుతో పాటు మరిన్ని మెరుగైన సేవలు కల్పించనున్నారు.

ఇది శుభసూచకం



అమృత్ భారత్ స్టేషన్ పథకం జాబితాలో అనపర్తి రైల్వేస్టేషన్‌కు స్థానం దక్కడం శుభసూచకం. సంవత్సరానికి సుమారు రూ.6 కోట్ల ఆదాయం లభించే అనపర్తి రైల్వే స్టేషన్‌లో ఆదాయానికి, ప్రయాణికుల రద్దీకి తగినంతగా సౌకర్యాలు లేవు. ఈ పథకం ద్వారా స్టేషన్ ఆధునికీకరణ, ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నా.

– సత్తి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి, రైల్వే పాసింజర్స్ అసోసియేషన్, అనపర్తి

మౌలిక వసతుల మెరుగుకు ప్రాధాన్యత



అనపర్తి రైల్వే స్టేషన్ ద్వారా అనపర్తి, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో సుమారు 50 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ సౌకర్యం, ప్లాట్‌ఫాంకు అనుగుణంగా షెడ్ల నిర్మాణం తదితర కనీస సదుపాయాలు కలుగుతాయని ఆశిస్తున్నా.

– నల్లమిల్లి ఆదిరెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, అనపర్తి

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు



పందలపాక ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీవైఈవో తిరుమలదాసు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజారెడ్డి

బిక్కవోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు చక్కటి ప్రణాళికతో శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని డీవైఈవో ఎం.తిరుమలదాసు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పందలపాక, మెళ్లూరు ఉన్నత పాఠశాలలతో పాటు కొంకుదురులోని ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను పునశ్చరణ చేయాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు

పెదపూడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించొచ్చని లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పదో తరగతిలో ఉత్తమ మార్కుల సాధన, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు గీత పద్మశ్రీవీరభద్రం, పీడీ వీర్రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఎంఎస్ఆర్ విద్యార్థి ప్రతిభ



హేమంత్ కుమార్‌ను అభినందిస్తున్న ఎం.అనంత సత్యనారాయణరెడ్డి

అనపర్తి: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. ఈ జట్టులో ప్రాతినిధ్యం వహించిన కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థి కె.హేమంత్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి హేమంత్ కుమార్‌ను విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీయడానికి ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. సీనియర్స్ విభాగంలో కె.రత్నసాయి, ఎస్.లాస్య గీసిన గుండె చిత్రానికి, జూనియర్స్ విభాగంలో ఎస్.లక్ష్మీప్రసన్న, జి.సుబ్బలక్ష్మి గీసిన ఆరోగ్య భావన చిత్రానికి ప్రథమ బహుమతులు లభించాయి. సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, జె.మోహనరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.వీరబాబు, డ్రాయింగ్ టీచర్ టి.మాచారమ్మ పర్యవేక్షించారు.

గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం ఓ స్వాతంత్ర్య సమరయోధుని గాథ అనే గ్రంథాన్ని పెనుగొండ కళాశాల తెలుగు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అరిపిరాల నారాయణరావు ఆవిష్కరించారు. సీతానగరం డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బొంగు రాజారావు ఆధ్వర్యంలో ఎస్‌డీపీ అజీజ్ రచించిన (1913–1963 ఓ స్వాతంత్ర్య సమరయోధుని గాథ) స్వాతంత్రోద్యమ నవల – అల్లూరి సత్యనారాయణ రాజు అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయుడు ఆర్.పాపారావు సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల పాల్గొన్నారు.

నాణ్యమైన వంటనూనెను వినియోగించాలి



సీతానగరంలో టీడీసీ మిషన్ ద్వారా వంటనూనె వినియోగాన్ని గుర్తిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రక్కయ్య

సీతానగరం: హోటళ్లు, స్వీట్ స్టాళ్లు, ఇతర ఆహార పదార్థాల్లో వంటనూనె వినియోగాన్ని నియంత్రించడంలో టీడీసీ మిషన్ (టోటల్ సోలార్ కాంపౌండ్) కీలక భూమికను పోషిస్తుందని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రక్కయ్య తెలిపారు. సోమవారం ఆయన పలు హోటళ్లు, స్వీట్ స్టాళ్లు, తదితర షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూనె వాడకం అధికమవ్వడం, నాణ్యమైన నూనెను వినియోగించకపోవడం ద్వారా అనారోగ్యాలు వస్తున్నాయన్నారు. టీడీసీ మిషన్ ద్వారా వంటనూనె వినియోగాన్ని నియంత్రించవచ్చన్నారు. అలాగే ఎన్నిసార్లు ఉపయోగించారో గుర్తించవచ్చన్నారు. ఈ మీటర్ ద్వారా నూనె మొదటిసారి వాడితే 8 నుంచి 15 పాయింట్లు వస్తుందని, దీనిలో 5 పాయింట్లు వరకూ మాత్రమే నూనెను ఉపయోగించుకోవచ్చన్నారు. ఎక్కువ సార్లు ఉపయోగించడం ద్వారా వినియోగదారులకు అజీర్తి, క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయన్నారు. మీటర్ ద్వారా పరిశీలించి, నిబంధనలను అతిక్రమంచిన నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: స్థానిక బాపనమ్మ గుడి వద్ద గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మిస్తున్న కల్చరల్ యాక్టివిటీస్ భవన నిర్మాణ పనులను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అనుసూరి సూర్యనారాయణ(బుజ్జి), ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనపర్తి టౌన్ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర బట్టరాజు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టిరాజు, స్థానిక నేత నల్లమిల్లి నారాయణరెడ్డి, వార్డు సభ్యుడు తేతలి రామకృష్ణారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు తేతలి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానసముపార్జనపై దృష్టి సారించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న లక్ష్మీనారాయణ

రాజానగరం: జ్ఞాన సముపార్జనపై దృష్టిని కేంద్రీకరిస్తే ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని ఐపీఎస్ విశ్రాంత అధికారి వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో సోమవారం నిర్వహించిన 2022–23 బ్యాచ్ ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను స్వతహాగా ఇంజినీర్‌నని, ఇంజినీర్లు ఆగిపోయిన యంత్రాలను నడిపించగలరన్నారు. అదే వైద్యులు ప్రాణాలతో ఉన్న మనుషుల రుగ్మతలు పోగొట్టేలా మరమ్మతులు చేయగలరన్నారు. అందుకనే వైద్యులను దేవుడిగా భావిస్తారన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ 250 మంది వైద్య విద్యార్థులున్న మొదటి బ్యాచ్ ఇదన్నారు. ఈవిధంగా 250 మంది మెడికోలున్న బ్యాచ్‌లు దేశంలో 30 కళాశాలలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జీఎస్ఎల్ రెండో కళాశాలగా పేర్కొన్నారు. అనంతరం కళాశాలలోని రోబోటిక్ కెడవర్ ల్యాబ్, అనాటమీ ల్యాబ్, సిములేషన్ ల్యాబ్‌లను లక్ష్మీనారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ గురునాథ్, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి పాల్గొన్నారు. అనంతరం వైద్య విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మూడు పూరిళ్లు దగ్ధం : రూ.3 లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన తాటాకిళ్లు

మధురపూడి: కమ్మరి కొలిమి నుంచి రేగిన మంటల కారణంగా సోమవారం మధ్యాహ్నం కోరుకొండ బస్టాండ్ ఎదురుగా మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వాటిలోని సామగ్రి, నగదు, వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. పీతా సుబ్రహ్మణ్య తన కమ్మరి కొలిమిలో కత్తులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రేగాయి. అందులోని కార్మికులందరూ బయటకు వచ్చేశారు. కమ్మరి కొలిమిని ఆనుకుని ఉన్న చింతా పాపమ్మ పండ్ల దుకాణం అలాగే కొవ్వూరి లోవరాజు, రమణమ్మ నివాసం ఉంటున్న ఇంటికి మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేసేందుకు స్థానికులు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది రెండు ఇంజిన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కమ్మర కొలిమిలో సరకులతో పాటు ఇతర సామగ్రి, నగదు కాలిపోయింది. కొవ్వూరి లోవరాజు ఇంట్లోని బీరువా, ఇతర వస్తువులు, నగదు బూడిదయ్యాయి. పాపాయమ్మ పండ్ల దుకాణంలో సామగ్రి, పండ్లు కాలిపోయాయి. కాగా.. బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు నేతుల చిన్ని, ఉల్లి గణ, బొండాడ చందు సహాయం అందించారు. జనసేన నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

గంజాయి, సారా నిర్మూలనకు చర్యలు

మధురపూడి: గంజాయి, సారా నిర్మూలనలో జిల్లా ముందంజలో ఉన్నట్టు డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ అన్నారు. సోమవారం కోరుకొండ మండలం కాపవరంలోని సెబ్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సీఐ, ఎస్సైల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ, ఐడీ ఫ్రీ రాష్ట్రంగా తయారుచేయాలన్న కార్యక్రమంలో భాగంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని, దానిలో భాగంగా సారా కేసులను నాన్ బెయిలబుల్ కేసులయ్యాయన్నారు. గంజా రవాణా, వినియోగం తగ్గిందన్నారు. జిల్లాలో 34 మందిపై పీడీ చట్టం నమోదు చేసి, జైలుకు పంపినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ 12,000 మందిపై కేసులు నమోదుచేశామన్నారు. కోరుకొండ స్టేషన్ పరిధిలో ఐదుగురిపై పీడీ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. నాటుసారా తయారీ దారులను సన్మార్గంలో నడిపేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవితం కల్పిస్తోందని, దానిలో భాగంగానే వివిధ పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. కోరుకొండ స్టేషన్‌లో పరిధిలో సన్మార్గంలోకి మారిన 65 మందిని ప్రతిపాదించగా, 25 మందిని గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే నగరంలో డ్వాక్రా బజార్లు

రాజమహేంద్రవరం సిటీ: త్వరలోనే నగరంలోని పలు ప్రధాన జంక్షన్లలో షాపులు నిర్మించి మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. స్థానిక 49వ డివిజన్ సుబ్బారావు నగర్‌లో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు అధ్యక్షతన సోమవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళలు ఆధునిక పోకడలను అర్థం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించేందుకు ముందుకు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి చేస్తున్న కృషిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ డివిజన్‌లో దాదాపు 200 డ్వాక్రా సంఘాలు ఉన్నాయంటేనే చైతన్యం కనిపిస్తోందని, అదే స్ఫూర్తితో వ్యాపార, వాణిజ్య రంగాలలో అడుగుపెట్టి నగర ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిన భవానీ ప్రియ, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ



వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నమూనా చిత్రం

అనపర్తి: రామవరంలో కోట్లాది రూపాయల ఖర్చుతో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు మార్చి 1న భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించనున్నామని చెప్పారు. భూమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి చింతా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు



కొంకుదురులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఎంపీటీసీ కొంకుదురు పీపీ అన్నారు. సోమవారం మండలంలోని కొంకుదురులో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు, రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొంకుదురు పీపీ మాట్లాడుతూ ప్రస్తుతం మనం తినే ఆహారంలో విషపూరితమైనవే ఎక్కువగా ఉంటున్నాయని, అందుకే ప్రతి ఒక్కరూ సేంద్రియ ఆహారానికి పెద్దపీట వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐబీఎస్‌డీపీ చింతలపూడి వెంకట సత్యవతి, కొక్కిరి మెట్ట పుల్లయ్య కాపు, జి.ఈశ్వరకుమార్, జి.సత్యవేణి, లక్ష్మీకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అఖండ హరినామ సంకీర్తన ఏకాహం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో సరిపల్లిపేట తూర్పు కాపుల సంఘం సీతారాముల ఆలయం వద్ద ఘనంగా అఖండ హరినామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు. గొరపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో నవదుర్గ బాలభక్త భజన సమాజంతో పాటు మరో 6 బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో గురుస్వామి గురజాపు అన్నవరం, నల్లమిల్లి గంగిరెడ్డి, కరణం పెదకాపు, చింతల అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 వేలు పింఛను మంజూరు చేయాలి

రాజానగరం: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛను పొందుతున్న తనకు రూ. 5 వేల పింఛను మంజూరు చేయించాలని నందరాడకు చెందిన బత్తుల శంకర్రావు సోమవారం కలెక్టర్ మాధవీలతకు విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా తాను పక్షవాతంతో బాధపడుతున్నానని, ఈ కారణంగా పక్షవాతంతో బాధపడే వారికి ఇస్తున్న రూ. 5 వేలు మంజూరు చేయించాలన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో ఉపాధి కూలీలకు అన్యాయం చేసిన సిబ్బందిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమిల్లి హరికృష్ణ అర్జీ అందించారు.

45 మందికి కంటి పరీక్షలు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసన్న కుమార్

సీతానగరం: మండలంలోని కూనవరంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి డాక్టర్ ప్రసన్న కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. నలుగురికి శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

పందలపాకలో బంగారు ఆభరణాల చోరీ

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఆదివారం రాత్రి జరిగిన చోరీలో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దంగేటి శ్రీదేవి ఆదివారం రాత్రి తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి అక్కడే నిదురించింది. సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు తాళం లేదు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని మూడు కాసుల బంగారు తాడు, 10 తులాల వెండి పట్టీలతో పాటు నగదు అపహరణకు గురైందని గుర్తించి ఆమె పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ పి.బుజ్జిబాబు ఘటనా స్థలం పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.